RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 298 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం బుధవారం, 1 మే 2024 పేజీలు : 4 వెల : 2/-

## అవినీతిలో కేసీఆర్‌ను మించిపోయిన రేవంత్ సర్కార్!




## అల్లాదుర్గం బహిరంగ సభలో ప్రధాని మోదీ

అల్లాదుర్గం: భారత్‌ను కాంగ్రెస్ అవినీతి ఊబిలోకి నెట్టివేసిందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆరోపించారు. భాజపా ఎన్నికల ప్రచారంలో మెదక్ జిల్లా అల్లాదుర్గంలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగించారు. " కాంగ్రెస్ పాలనలో అవినీతి ఏ స్థాయిలో జరిగిందో, పదేళ్లలో దేశం ఎంతగా అభివృద్ధి చెందిందో అందరూ చూశారు. కాంగ్రెస్ ఎప్పుడూ అబద్ధాలు, ఓటు బ్యాంకు రాజకీయాలు, అవినీతి చేస్తుంది. కాంగ్రెస్ అధికారంలో ఉన్న చోట పంచ సూత్రాలతో పాలన చేస్తుంది. ఆ పంచ సూత్రాలు.. అవినీతి, అబద్ధాలు, మాఫియా, కుటుంబ పాలన, ఓటు బ్యాంకు రాజకీయాలు. దేశంలో మళ్లీ పాతరోజులు తీసుకురావాలని ఆ పార్టీ చూస్తోంది. ఆర్‌ఆర్‌ఆర్ సినిమా సూపర్ హిట్ అయిన సంగతి మీ అందరికీ తెలుసు. ఈరోజు తెలంగాణలో డబుల్ 'ఆర్' ట్యాక్స్‌పై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. వ్యాపారులు, గుత్తేదార్లు దొడ్డిదారిలో ఈ ట్యాక్స్ కడుతున్నారు. ఆర్‌ఆర్‌ఆర్ సినిమా వల్ల ప్రపంచమంతా గర్వపడితే.. డబుల్ ఆర్ ట్యాక్స్‌తో దేశం సిగ్గుపడుతోంది. పారిశ్రామిక వేత్తల నుంచి వసూలు చేస్తున్న ఆర్ఆర్ ట్యాక్స్‌తో దిల్లీకి కప్పం కడుతున్నారు. గతంలో భారాస ఎలా అవినీతికి పాల్పడి తెలంగాణను దోచుకుందో.. ఇప్పుడు కాంగ్రెస్ అదే పని చేస్తోంది. దీనికి అడ్డుకట్ట పడాలంటే భాజపా అభ్యర్థులను గెలిపించాలి. పొరపాటున కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మన వారసత్వ సంపద నుంచి కొత్త ట్యాక్స్ వసూలు చేస్తామంటున్నారు. తల్లిదండ్రులు సంపాదించిన దాంట్లో నుంచి 55శాతం ఆస్తి మన పిల్లలకు దక్కకుండా కాజేసేందుకు కుట్రలు పన్నుతోంది. ఇలాంటి భయానక నిర్ణయాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కాళేశ్వరం అతిపెద్ద కుంభకోణం. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో భారాస దోచుకుందని అప్పుడు ప్రతిపక్షంలోఉన్న కాంగ్రెస్ ఆరోపించింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ భారాసను కాపాడేందుకు ప్రయత్నిస్తోంది. అవినీతిలో ఈ రెండు పార్టీలు ఒక్కటే.

**రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ రైతులను చేసింది..** రైతులను భగవత్ స్వరూపులుగా భాజపా చూస్తోంది. తెలంగాణలో 100 రోజుల్లో రుణమాఫీ చేస్తామని చెప్పి కాంగ్రెస్ రైతులను మోసం చేసింది. వరికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామన్న ఆ పార్టీ హామీ నెరవేరలేదు. పేదలు ఎప్పటికీ పేదలుగానే ఉండాలని కాంగ్రెస్ చూస్తోంది. హైదరాబాద్‌లో పండుగలు జరుపుకోవాలంటే ఎన్నో ఆంక్షలు. ఓ వర్గం వారి ఓట్ల కోసం మిగతవావారిని ఇబ్బంది పెడుతున్నారు. తెలంగాణను మొన్నటి వరకు భారాస దోచుకుంటే, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటోంది. అయోధ్యలో రామమందిరం 500 ఏళ్ల భారతీయుల స్వప్నం. దిల్లీలో పటిష్ఠమైన ప్రభుత్వం లేక ఇన్నాళ్లూ ఆకల సాకారం కాలేదు. మీ అందరి సహకారంతో, మీరు వేసిన ఓటుతో అయోధ్యలో భవ్యమైన దివ్యమందిరం నిర్మాణం సాధ్యమైంది. మీరు వేసే ఒక్కొక్క ఓటుతో మీ కలలు సాకారం చేస్తాం.

**ఎస్సీ వర్గీకరణకు నేను అనుకూలం...** ఉమ్మడి ఏపీలో 2004-09లో రికార్డు స్థాయిలో కాంగ్రెస్ ఎంపీలను గెలిపించారు. కానీ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల హక్కులను ఆ పార్టీ ఏవిధంగా కాలరాసిందో కళ్లారా చూశారు. తెలంగాణలో పెద్ద సంఖ్యలో ఉన్న లింగాయత్, మరాఠాలకు కాంగ్రెస్ న్యాయం చేయలేదు. 26 బీసీ కులాలను కేంద్ర జాబితాలో చేర్చకుండా రాత్రికి రాత్రి ముస్లింలను ఓబీసీ జాబితాలో చేర్చింది. ఎస్సీ వర్గీకరణకు నేను అనుకూలం కేంద్రంలో భాజపా అధికారంలోకి వస్తేనే ప్రజల సంపదకు రక్షణ. అత్యయిక పరిస్థితి విధించిన చరిత్ర కాంగ్రెస్‌ది. రాజ్యాంగంలో మతపరమైన రిజర్వేషన్లకు తావులేదు. రాజ్యాంగం అంటే విత్ర గ్రంథంగా భావిస్తాం. రాజ్యాంగంపై, అంబేడ్కర్‌పై కాంగ్రెస్‌కు గౌరవం లేదు. తొలి ప్రధాని నెహ్రూ రాజ్యాంగాన్ని అవహేళన చేస్తే.. ఇందిరగాంధీ తూట్లు పొడిచారు. రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడింది భాజపా మాత్రమే" అని ప్రధాని మోదీ వివరించారు.

## కాంగ్రెస్ పాలనలో ఆటో కార్మికుల జీవితాలు రోడ్డున పడ్డాయి:హరీశ్‌రావు

సిద్దిపేట జిల్లా: కాంగ్రెస్ పాలనలో ఆటో కార్మికుల జీవితాలు రోడ్డున పడ్డాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. 28మంది ఆటో కార్మికులు చనిపోతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. కనీసం వారి కుటుంబాలను కూడా పరామర్శించలేదని చెప్పారు. కార్మికులకు ముందస్తుగా మేడే శుభాకాంక్షలు తెలిపారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శివానుభవ మండపంలో మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్ రాంరెడ్డికి మద్దతుగా ఆటోయూనియన్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హరీశ్‌రావు, వెంకట్ రాంరెడ్డి, బీఆర్‌ఎస్ ముఖ్యనేతలు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ... బీజేపీ అధికారంలోకి వచ్చాక కార్మికుల హక్కులు కాలరాయబడ్డాయన్నారు. కార్మికుల హక్కులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ కాపాడకుండా ఆదానీ, అంబానీలకు సహకరిస్తున్నారని ఆరోపించారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బాండ్ పేపర్‌లపై కాంగ్రెస్ రాసి ఇచ్చిన హామీలు 100రోజుల్లో ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.



మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో 6 గ్యారెంటీలపై రేవంత్‌రెడ్డి ప్రామిసరీ నోట్లు రాశారని.. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లో దేవుళ్లపై ఓట్లు వేస్తున్నారని ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులకు ఓటేస్తే.. హామీలను అమలు చేయకపోయిన ప్రశ్నించే అస్కారం ఉండదని అన్నారు. వెంకట్ రాంరెడ్డిని మెదక్ ఎంపీగా గెలిపిస్తే కాంగ్రెస్ మెడలు వంచి హామీలు అమలు చేయిస్తామని మాటిచ్చారు. బాండ్ పేపర్ బౌన్స్ అయినా కాంగ్రెస్‌కు ఎంపీ ఎన్నికల్లో ఓటుతో శిక్ష వేయాలన్నారు. రేవంత్ అసమర్థతతో కరెంటు సరఫరాను కూడా సరిగా చేయలేక పోయారన్నారు. ఈ విషయంలో ఉద్యోగస్తులకు షోకాజ్ నోటీసులు, ట్రాన్స్‌ఫర్లు చేస్తూ, సస్పెండ్ చేస్తూ రేవంత్ ప్రభుత్వం వేధిస్తోందని ధ్వజమెత్తారు. బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకున్నారని.. అతనికి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సిద్దిపేటకు ఏ ముఖం పెట్టుకొని రేవంత్ వస్తున్నారని ప్రశ్నించారు.

వెటర్నరీ కాలేజ్‌ని కొడంగల్‌కు తీసుకుపోయారని.. ఆ కాలేజ్‌ని సిద్దిపేటలోనే కొనసాగిస్తానని చెప్పాకే ఇక్కడ అడుగుపెట్టాలని హరీశ్‌రావు అన్నారు.

## రాముడి పేరు చెప్పి బీజేపీ ఓట్లు అడుగుతోంది: సీఎం రేవంత్



జయశంకర్ భూపాలపల్లి: రాముడి పేరు చెప్పి బీజేపీ ఓట్లు అడుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణకు మోదీ గాడిద గుడ్డు ఇచ్చారని విమర్శించారు. సీతారాముల కళ్యాణం చేసిన తర్వాత అక్షింతలు ఇస్తామని.. కానీ కల్యాణం జరగకముందే బీజేపీ నేతలు ఇక్కడ అక్షింతలు పంచారని చెప్పారు. రాముడిని బీజేపీ అవమానించిందని మండిపడ్డారు. తామంతా రాముని భక్తులమేనని స్పష్టం చేశారు.

తమకంటే గొప్ప హిందువులు ఉన్నారా అని ప్రశ్నించారు. హిందువులను తాము ఓటు బ్యాంకులాగా వాడుకోమని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రేగొండ జనజాతర భారీ బహిరంగ సభలో బీఆర్‌ఎస్, బీజేపీలపై రేవంత్ తీవ్ర విమర్శలు గుప్పించారు.

**గుండు, అరగుండును గెలిపిస్తే ఏం చేశారు..** ఉద్యమంలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు కరీంనగర్ అండగా నిలబడ్డిందని తెలిపారు. కరీంనగర్ ప్రజలను కేసీఆర్ మోసం చేశారని మండిపడ్డారు. సెమీ ఫైనల్లో కేసీఆర్‌ను ఓడించాం..ఫైనల్లో గుజరాత్ గులాములను ఓడిస్తామని చెప్పారు. మోదీ తెలంగాణకు ఇచ్చింది ఏం లేదని.. బండి సంజయ్ రాష్ట్రానికి తెచ్చింది ఏం లేదన్నారు. తెలంగాణను మోదీ అవమానిస్తుంటే..బండి సైలెంట్‌గా ఉన్నారని ధ్వజమెత్తారు. గుండు, అరగుండును గెలిపిస్తే.. ఏం చేశారని ప్రశ్నించారు. నిజామాబాద్, కరీంనగర్ బీజేపీ ఎంపీలు నాటకాలు ఆడుతున్నారని సీఎం ధ్వజమెత్తారు.




## భరోసాలో ఫుల్ జోష్

### కేసీఆర్ రంగంలోకి దిగడంతో క్యాడర్‌లో నూతనోత్సాహం

### కేసీఆర్ బస్సు యాత్రకు అడుగడుగునా బ్రహ్మరథం

హైదరాబాద్ : లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్రకు అనూహ్య స్పందన లభిస్తున్నది. గులాబీ బాస్ నేరుగా ఫీల్డ్‌లోకి దిగడంతో పార్టీలో నూతనోత్సాహం వెల్లివెరిస్తున్నది. కేసీఆర్ రోడ్‌షోలకు జనం వెల్లువెత్తుతున్నారు. ఎక్కడకు వెళ్లినా మాజీ సీఎంకు బ్రహ్మరథం పడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో బీఆర్‌ఎస్ వెనుకబడిందని ప్రచారం చేసిన ప్రత్యర్థి పార్టీలకు మింగుడు పడడం లేదు. కేసీఆర్ టూర్‌కు వస్తున్న స్పందనను చూసి ప్రధానంగా అధికార కాంగ్రెస్ పార్టీకి కునుకు పట్టడం లేదు.

**అడుగడుగునా బ్రహ్మరథం..** ఆరోగ్యం సహకరించక పోయినప్పటికీ ప్రజల కోసం, తెలంగాణ బాగు కోసం కదిలిన బీఆర్‌ఎస్ అధినేతకు అడుగడుగునా ఆత్మీయ స్వాగతం పలుకుతున్నారు. ఏప్రిల్ 24న మొదలైన బస్సుయాత్రకు బ్రహ్మరథం పడుతున్నారు. రైతులు, పేదలు, మహిళలు, యువకులు తరలి వచ్చి కేసీఆర్‌కు జేజేలు కొడుతున్నారు. మార్పు పేరుతో కాంగ్రెస్ చేసిన మోసాన్ని గులాబీ బాస్ దృష్టికి తీసుకొస్తున్నారు. అబద్ధాల హామీలతో బొటాబొటి మెజార్టీతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ మెడలు వంచే ఏకైక పార్టీ బీఆర్‌ఎస్ మాత్రమేనని జనం స్పష్టం చేస్తున్నారు. నమ్మించి జనాలను నట్టేట ముంచిన హస్తం పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పాలంటే బీఆర్‌ఎస్‌ను గెలిపించాలన్న కేసీఆర్ నినాదం ప్రజల్లోకి బలంగా వెళ్తున్నది. రైతులు, మహిళలు, యువత, విద్యార్థుల్లో కేసీఆర్‌కు అండగా నిలువాలన్న తాపత్రాయం కనిపిస్తున్నది.

**ప్రజల్లో అమితాసక్తి..** కేసీఆర్ బస్సుయాత్రకు వస్తున్న అపూర్వ స్పందనతో బీజేపీ, కాగ్రెస్ పార్టీల్లో కలవరం మొదలైంది. అదే సమయంలో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. గెలుపు అవకాశాలు భారీగా పెరగడంతో గులాబీ నేతలంతా రెట్టించిన ఉత్సాహంతో ప్రచారంలో దూసుకెళ్తున్నారు. అనేక లోక్‌సభ నియోజకవర్గాల్లో బీజేపీ, కాంగ్రెస్ పరస్పరం సహకరించుకుంటున్నాయని బలంగా ప్రచారం జరుగుతున్నది. ఈ కుట్రను ఛేదిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ప్రజల్లోకి వచ్చి వాస్తవాలను చెబుతూ అవగాహన కల్పిస్తున్నారు. స్వల్ప ఓట్ల ఆధిక్యంతో రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ తీరును కేసీఆర్ అడుగడుగునా ఎండగడుతున్నారు. కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని విడమరిచి చెప్పడంతో పాటు పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలవాల్సిన ఆవశ్యకతను వివరిస్తున్నారు. అధికారంలోకి వచ్చి 5 నెలలు పూర్తవుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి కేవలం రాజకీయ ఆరోపణలు మినహా రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమంపై దృష్టి పెట్టడం లేదు. పైగా ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారు. ఈ పరిస్థితులను కేసీఆర్ తనదైన శైలిలో ప్రజలకు విశదీకరిస్తున్నారు. ఉద్యమ కాలంలో సంధించిన మాటల తూటాలను బస్సు యాత్రలో పేలుస్తూ కాంగ్రెస్ బండారాన్ని బట్టబయలు చేస్తూ దిగ్విజయంగా బస్సు యాత్రను కొనసాగిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కేసీఆర్‌ను రాజకీయంగా దెబ్బకొట్టేందుకు బీజేపీ, కాంగ్రెస్ ఉమ్మడిగా కుట్రలు చేస్తున్నప్పటికీ గులాబీ దళపతి మాత్రం మొక్కవోని దీక్షతో ప్రజల్లోకి వెళ్తూ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు.

# సంపాదకీయం


ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## రిజర్వేషన్ల రద్దు మీద ఆరెస్సెస్ మాటే ఫైనల్ !?

దేశంలో రిజర్వేషన్లు ఉండాలా వద్దా అన్నది అతి పెద్ద డిబేట్. ఇది సుదీర్ఘ కాలంగా జరుగుతూ వస్తోంది. ఈ దేశంలో రిజర్వేషన్ల విధానం తీసుకుని వచ్చింది మన వాళ్ళు కాదు బ్రిటిష్ వారు. వారి హయాంలో పాలన సాగుతున్నపుడు వెనకబడిన అట్టడుగు వర్గాలకు కొంత ఊతం ఇవ్వాలని ఈ విధానం తెచ్చారు. అయితే అది భారత రాజ్యాంగం రాసుకున్న తరువాత కూడా కంటిన్యూ అయింది. రిజర్వేషన్లు అన్నది ఉండాల్సిందే అని వాదించే వర్గాలు ఉన్నాయి వద్దు అన్న వారూ ఉన్నారు. అయితే బీజేపీ రిజర్వేషన్లకు వ్యతిరేకం అని విపక్షాలు చాలా కాలంగా ఆరోపిస్తూ వస్తున్నాయి. ఈసారి మాకు నాలుగు వందల సీట్లు ఇవ్వండి మేము చేసే పాలన వేరే లెవెల్ లో ఉంటుందని జేపీ అగ్ర నేతలు చెబుతూ వస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ అయితే గత పదేళ్ల పాలన అంతా జస్ట్ ట్రైలర్ మాత్రమే అని చాలా సభలలో చెప్పారు. ఈసారి బీజేపీ గెలిస్తే చేసేదే అసలైన పాలన, సినిమా అంతా అపుడే అని అంటున్నారు. దీనిని విపక్షాలు పట్టుకుని దేశంలో రిజర్వేషన్లు రద్దు చేస్తారు అని ప్రచారం మొదలెట్టేశాయి. అలాగే రాజ్యాంగం మారుస్తారు అని కూడా అంటూ వచ్చారు. రాజ్యాంగాన్ని మార్చడం మీద అయితే ప్రధాని నరేంద్ర మోడీ ఖండిస్తూ వివరణ ఇచ్చారు. సాక్షత్తూ అంబేద్కర్ దిగి వచ్చినా కూడా రాజ్యాంగాన్ని మార్చేది ఉండదని ఆయన ఖండితంగా చెప్పారు. తాము ఆ జోలికి పోవడం లేదు అని అన్నారు ఇక ఇపుడు రిజర్వేషన్లు రద్దు గురించి ప్రతిపక్ష నేతలు మాట్లాడుతున్నారు. తాజాగా తెలంగాణాకు చెందిన కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అయితే బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని మొత్తానికి మొత్తం పోతాయని సంచలన ప్రకటన చేశారు. దాంతో రాజకీయ అలజడి రేగింది. దీని మీద కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అయితే కౌంటర్ ఇచ్చారు. మాకు ఆ ఆలోచనే లేదని అన్నారు. రేవంత్ రెడ్డి తన మాటలు మాకు ఆపాదిస్తున్నారు అని మండిపడ్డారు. అయితే దీని మీద చాలా అనుమానాలు అలాగే ఉన్నాయి. దాంతో బీజేపీకి మాతృ సంస్థ అయిన ఆరెస్సెస్ సీన్ లోకి వచ్చింది. ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ అయితే పూర్తి స్థాయిలో ఖండించారు. తాము రిజర్వేషన్లకు వ్యతిరేకం అని ఒక వీడియో వైరల్ అవుతోందని అదంతా తప్పు అని ఆయన స్పష్టం చేశారు. అవసరం ఉన్నంతవరకూ వాటిని కొనసాగించాల్సిందే అని ఆయన అన్నారు. హైదరాబాద్ లోని నాదర్ గుల్ లో నిర్వహించిన ఒక కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ సమాజంలో భేదభావాలు పోయేంతవరకు రిజర్వేషన్లు ఉండి తీరాల్సిందే అని ఆయన సమర్ధించారు. ఈ విషయంలో ఆరెస్సెస్ మీద తప్పుడు ప్రచారం చేస్తున్నారు అని ఆయన మండిపడ్డారు. ఈ విధంగా భగవత్ చెప్పడం ఇది చాలాసార్లు జరిగింది. కానీ రిజర్వేషన్ల కొనసాగింపు మీద అనుమానాలు అలాగే ఉన్నాయి. మరో వైపు చూస్తే రిజర్వేషన్ల వల్ల దేశం ముందుకు సాగడం లేదని ప్రతిభావంతులు మేధ సంపత్తి వలస బాట పడుతోందని కీలకమైన చర్చ కూడా ఉంది. రిజర్వేషన్లు ఉండాల్సిందే కానీ వాటిని సైతం పరిమితం చేయాలన్న మాట కూడా ఉంది. ఒక కుటుంబంలో ఒక వ్యక్తి రిజర్వేషన్ ఫలితాలను పొంది సమాజంలో ముందు స్థానం లోకి వచ్చినపుడు వారి కుటుంబానికి రిజర్వేషన్లు అవసరం ఉండదని అదే బడుగు బలహీన వర్గాలకు చెందిన మరో పేదకు ఆ అవకాశం ఇవ్వాలన్న వాదన కూడా ఉంది. ఒక కుటుంబానికి ఒక్కసారే చాన్స్ అన్న ఆలోచన మీద కూడా చర్చ సాగుతోంది. మరో వైపు ప్రభుత్వ రంగ సంస్థలు అన్నీ ఒక్కోటిగా ప్రైవేట్ పరం చేస్తున్నారు.ప్రభుత్వ విద్య కంటే ప్రైవేట్ విద్యకు పెద్ద పీట వేస్తునారు. ఈ నేపధ్యంలో రిజర్వేషన్లు ఉన్నా కూడా వాటి వల్ల ఒనగూడే ప్రయోజనం ఏమిటి అన్నది కూడా ఆయా అణగారిన వర్గాలలో వస్తున్న ప్రశ్న. ఇవన్నీ పక్కన పెడితే ఆరెస్సెస్ రిజ్రవేషన్ల రద్దు విషయంలో ఒక క్లారిటీ ఇచ్చి ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టింది అనుకోవచ్చా లేక మూడవసారి మోడీ ప్రభుత్వం అధికారం చేపడితే ఈ విషయంలో ఏమైనా మార్పులు ఉంటాయా అంటే వేచి చూడాల్సిందే అంటున్నారు

# ఆజాద్ హింద్ ఫౌజ్: ముస్లిం పోరాటయోధులు" గ్రంథానికి సాహితీ పురస్కారం"

### పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రకటన






**హైదరాబాద్ ఏప్రిల్ 30(ప్రభాత సమాచారం)**
ప్రముఖ చరిత్రకారుడు, పలనాడు జిల్లా పిడుగురాళ్ల నివాసి సయ్యద్ నశీర్ అహమ్మద్ రచించిన " ఆజాద్ హింద్ ఫౌజ్ (భారత జాతీయ సైన్యం) : ముస్లిం పోరాట యోధులు" పరిశోధనాత్మక చరిత్ర గ్రంథానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం "సాహితీ పురస్కారం" ప్రకటించింది. విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ తంగెడ కిషన్ రావు స్వయంగా చరిత్రకారుడు నశీర్ అహమ్మద్ కు 29-04-2024 రాత్రి వర్తమానం అందించారు. ప్రతి ఏటా విశ్వవిద్యాలయం ప్రకటించే సాహితీ పురస్కారాలలో భాగంగా " వచన ప్రక్రియ " విభాగంలో 2022కు గాను ఈసారి 2019లో నశీర్ రచించిన 484 పుటల చరిత్ర గ్రంథం ఎన్నికయ్యింది. తన కళాశాల సహాధ్యాయి శ్రీ వియస్సార్ అవధాని సహకారంతో ముద్రితమైన ఈ గ్రంథాన్ని దేశంలోని సుమారు 400 గ్రంథాలయాలకు "చిరుగానుక"గా అందించారు. ప్రస్తుత సాహితీ పురస్కారాన్ని హైదరాబాదులోని విశ్వవిద్యాలయం ప్రాంగణంలో త్వరలో జరిగే పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమంలో 20,116 రూపాయల నగదుతోపాటు, పురస్కార జ్ఞాపికను అందజేసి నశీర్ అహమ్మద్ ను విశ్వవిద్యాలయం సత్కరిస్తుంది.గతంలో "పరిశోధన విభాగం"లో నశీర్ అహమ్మద్ రచనలకు గుర్తింపుగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మక " కీర్తి పురస్కారం" లభించగా ప్రస్తుతం "సాహితీ పురస్కారం" నశీర్ కు దక్కటం చరిత్ర రచనారంగాన ఆయన ప్రతిభాపాటవానికి తార్కాణంకాగలదు.గత 30 ఏండ్ల నుండి "భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లిం జనావళి పాత్ర"ను వివరిస్తూ నశీర్ అహమ్మద్ ఇప్పటి వరకు తెలుగులో 23 పరిశోధనాత్మక చరిత్ర గ్రంథాలను రచించి వెలువరించారు. ఆ గ్రంథాలలో కొన్ని ఆంగ్లం, కన్నడం, ఉర్దూ, తమిళం, గుజరాతీ, మరాఠీ భాషల్లో అనువాదమై ప్రచురితం అయ్యాయి. ఆయన గ్రంథాల రచన, ప్రచురణ, పంపిణితో సరిపెట్టుకోకుండా ఆయా గ్రంథాలలోని చారిత్రకి సమాచారాన్ని వివిధ ప్రచార - ప్రసార మాధ్యమాల ద్వారా దేశంలోని ప్రజల చెంతకు చేర్చుతూ బహుళ రీతులలో పలు ప్రచార కార్యక్రమాలను దేశవ్యాప్తంగా ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. మిత్రుల, వదాన్యుల ఆర్ధిక చేయూతతో వెలువరిస్తున్న ఆయన గ్రంథాలను దేశంలో మాత్రమే కాకుండా విదేశాలలోని ఎంపిక చేసిన వందలాది గ్రంథాలయాలకు తన దాతల కానుకగా నశీర్ అహమ్మద్ అందజేస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు తన గ్రంథాల పిడిఎఫ్ ఫైళ్ళను సుమారు 30వేల మంది పాఠకులకు వివిధ సామాజిక మాధ్యమాల అందజేసారు. ఈ మేరకు సేవా దృక్పథంతో విస్మరణకు గురైన చరిత్రను ప్రపంచం దృష్టికి తీసుకొచ్చేందుకు నిరంతరం ఆయన సాగిస్తున్న విశేష కృషికి గుర్తింపుగా పలు జాతీయ - అంతర్జాతీయ చారిత్రక - సాహితీ - సేవా సంస్థలు ఆయనను పలు అవార్డులు, పురస్కారాలతో సత్కరించి గౌరవించాయి. ప్రస్తుతం సయ్యద్ నశీర్ అహమ్మద్ కు శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మక " సాహితీ పురస్కారం " ప్రకటించటంతో ఆయన మిత్రులు, సన్నిహితులు అభినందనలు తెలుపుతున్నారు.

# బీటీ-3 పత్తిసాగు నిరోధంలో నిర్లక్ష్యం

జగిత్యాల : బీటీ-3 పత్తిని సాగు చేయవద్దని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యవసాయ వర్సిటీ పేర్కొన్నా గత వానాకాలంలో ఈ నిషేధం అమలు కాలేదు. వరంగల్, జగిత్యాల ఆర్ఏఆర్ఎస్‌ల పరిధిలోని పలు జిల్లాల్లో బీటీ-3 విత్తనాలను పండించినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. అయితే బీటీ-3 విత్తనాల పట్ల రైతుల ఆసక్తిని బట్టి పలు ప్రాంతాల్లో బీటీ-2 విత్తనాలను కూడా బీటీ-3 పేరిట అమ్మినట్లు గుర్తించారు. సాధారణంగా బీటీ-3 విత్తనాలతో పండించిన పంటపై గ్లైఫోసేట్ గడ్డిమందును పిచికారీ చేసినా పంట మొక్కలకు ఎలాంటి హాని జరగకపోగా కలుపు పూర్తిగా తొలగిపోతోంది కానీ.. బీటీ-2 విత్తనాలను బీటీ-3 పేరిట సాగుచేసి గ్లైఫోసేట్‌ను పిచికారీ చేస్తే పంటంతా ఎండి తీవ్రంగా నష్టపోతారు. నిషేధిత గ్లైఫోసేట్ గడ్డిమందును చాలామంది వాడుతున్నారు. గ్లైఫోసేట్ను వాడినపుడు మనుషుల ఆరోగ్యాలు దెబ్బతినటం, పర్యావరణానికి తీవ్రవిఘాతం కలుగుతుందంటూ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రైతులు.. జాగ్రత్త: బీటీ1 విత్తనాలు తలనత్త, గులాబీరంగు, సెనగపచ్చ పురుగును తట్టుకోగా, బీటీ2 విత్తనాలు తలనత్త, గులాబీరంగు, సెనగపచ్చ పురుగుతో పాటుగా లద్దెపురుగులను కూడా తట్టుకునే శక్తిని కలిగి ఉన్నాయి. అయితే బీటీ-3 వీటన్నింటితో పాటుగా కలుపు నివారణ రసాయనాన్ని తట్టుకొని అధిక దిగుబడి ఇస్తుందని పేర్కొన్నా శాస్త్రీయంగా మన దేశంలో నిరూపణ కానందున సాగువద్దని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మరోవైపు గత పంటకాలాల్లో బీటీ విత్తనాలపైనా చీడపీడలు ఆశించటం బీటీవిత్తనాల సామర్థ్యాన్ని ప్రశ్నార్ధకం చేస్తోంది. కొన్నిచోట్ల బీటీ పేరిట నకిలీ విత్తనాలను కూడా విక్రయిస్తున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. జిన్నింగ్ మిల్లుల్లోని పత్తిగింజలకు రంగులు పట్టించి అందమైన కవర్లలో, డబ్బాల్లో నింపి ప్రముఖ కంపెనీల లేబుళ్ల పేరిట గుట్టుగా విక్రయాలు సాగిస్తారు. జిన్నింగ్ మిల్లుల్లో నుంచి పత్తిగింజలను అతి తక్కువ ధరకు తీసుకొచ్చి విత్తనాలుగా చలామణి చేసినపుడు కొన్ని వందల రెట్ల లాభం వస్తుండటంతో మోసగాళ్లు నకిలీ విత్తనాల చలామణి చేపడుతున్నారు. లాభం ఎక్కువగా వస్తుందని వ్యాపారులు, జేబులు నిండుతాయని కొన్నిచోట్ల అధికారులు సహకరిస్తుండటంతో నకిలీ విత్తనాలు యథేచ్ఛగా రైతుల క్షేత్రాలకు చేరుతున్నాయి. నకిలీ విత్తనాల మొక్కలు మొలిచి ఎదిగినా కాయలు అతితక్కువగా వచ్చి దిగుబడి సగానికి పడిపోతుంది. చీడపీడల ఉద్ధృతి పెరిగి సస్యరక్షణ ఖర్చు పెరగటంతో ఏమాత్రం గిట్టుబాటు కాదు. పల్లెల్లో జీరోగా విత్తనాలను అమ్మటం, కొన్ని దుకాణాల్లో బిల్లులు ఇవ్వనందున రైతులు నష్టపోయిన సందర్భాల్లో కనీసం ఫిర్యాదుకు కూడా నోచుకోవటం లేదు. వచ్చే సీజన్‌లో పత్తిసాగు పెంచాలని ప్రభుత్వం పేర్కొంటున్నందున వ్యవసాయ, పోలీసు అధికారులు ఇప్పట్నుంచే దృష్టిసారించి బీటీ-3 విత్తనాలు, నకిలీ పత్తి విత్తనాల నిరోధంపై దృష్టిసారించాల్సి ఉంది.

# నీరివ్వని వాటర్ ఏటీఎంలు

పరిగి: నగరవాసులకు తక్కువ ధరకే శుద్ధ జలం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన సుమారు వంద వాటర్ ఏటీఎంలు అలంకారప్రాయంగా మారాయి. గత ప్రభుత్వ హయాంలో జీహెచ్ఎంసీ ఆరేళ్ల క్రితం వీటిని ఎల్బీనగర్, అమీర్‌పేట్, పాతబస్తీ, ఖైరతాబాద్, మలక్‌పేట, హైటెక్‌సిటీ, మియాపూర్, నాంపల్లి, దిల్‌సుఖ్‌నగర్, ఉప్పల్ తదితర రద్దీ ప్రాంతాలతో పాటు ప్రభుత్వ ఆసుపత్రులు, గ్రంథాలయాల సమీపంలో ఏర్పాటు చేసింది. నిర్వహణకు సిబ్బందిని నియమించింది. ఒక్కోదానికి రూ.6.50 లక్షలు వెచ్చించి నీటి శుద్ధి పరికరాలను కొనుగోలు చేసింది. రూపాయికి అర లీటరు, రూ.5కు 10 లీటర్ల చొప్పున స్వచ్ఛమైన నీటిని అందించేవారు. ఇవి ప్రారంభంలో బాగానే పనిచేసినా అనంతరం నిర్వహణ కొరవడటంతో మూలకు చేరాయి. శీతాకాలం, వర్షాకాలంలో వీటి వినియోగం తక్కువగా ఉండటంతో తాళాలు వేసి వదిలేయడంతో ఇప్పుడు మొరాయిస్తున్నాయి. మలక్‌పేట పరిధి ఆనందనగర్ కాలనీతోపాటు మరికొన్ని ప్రాంతాల్లోని వాటర్ ఏటీఎంలలో రూ.5 నాణెం వేస్తే విద్యుత్తు షాక్ కొడుతోందని వినియోగదారులు చెబుతున్నారు.

ప్రైవేటు ప్లాంట్ల దందా.. నగరంలో నీటి కొరత, జీహెచ్ఎంసీ వాటర్ ఏటీఎంలు పనిచేయకపోవడం.. ప్రైవేటు శుద్ధజల కేంద్రాల నిర్వాహకులకు వరంగా మారింది. గతంలో 20 లీటర్ల నీటిని రూ.10కి విక్రయించగా ప్రస్తుతం రూ.20-30కి అమ్ముతున్నారు. వాటి పరిమితికి మించి నీటిని సరఫరా చేస్తున్నారు. బోరు నీటిని అప్పటికప్పుడే శుద్ధిచేసి విక్రయిస్తున్నారు. సాధారణంగా 12 పర్యాయాలు శుద్ధి ప్రక్రియ చేయాల్సి ఉంటుంది. నీటి నాణ్యత నిర్ధారించేందుకు మైక్రో బయలాజికల్ ల్యాబ్ ఉండాలి. ఇవేవీ కానరావడం లేదు.

ఎంఎంటీఎస్ స్టేషన్లకు దక్కని తాగునీటి సౌకర్యం

ఎన్నడూ లేని విధంగా ఏప్రిల్‌లోనే ఎండలు మండిపోతున్నాయి. ప్రయాణాలు సాగించేవారి అవస్థలు చెప్పనలవి కాదు. బస్సుల్లో వెళ్లే వారు తాగునీరు ఎక్కడుంటే అక్కడ ఆగి దాహార్తి తీర్చుకోవచ్చు. రైల్వే ప్రయాణికులకు అది సాధ్యం కాదు.. ఇదే విషయాన్ని పరిగణనలోకి తీసుకుని ద.మ. రైల్వే పరిధిలోని 170 స్టేషన్లలో 468 వాటర్ వెండింగ్ మెషిన్లు పెట్టి చల్లటి తాగునీరు అందిస్తున్నారు. ఎంఎంటీఎస్ స్టేషన్లలో ఈ సౌకర్యం అందుబాటులోకి రాలేదు. మొత్తమ్మీద కరోనా తర్వాత ఇప్పటికి ఐఆర్‌సీటీసీ రైల్వే స్టేషన్లలో వాటర్ వెండింగ్ మెషిన్లను (చల్లటి నీళ్లు అందించే యంత్రాలు) ఏర్పాటు చేసింది. ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్లలో తాగునీరు కాదు కదా మండుటెండలో ముఖం కడుక్కుందామన్నా కుదరని పరిస్థితి. చుట్టుపక్కల స్థానికులు నీరు పట్టుకెళుతున్నారని కుళాయిలను బంద్ చేశారు. దక్షిణ మధ్య రైల్వేకు ఆయువుపట్టు లాంటి సికింద్రాబాద్ స్టేషన్‌కు రోజూ 240 వరకూ రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. దాదాపు 1.80 లక్షల మంది ఈ స్టేషన్ ద్వారా ప్రయాణిస్తారు. ఇంతమంది నీటి అవసరాలు తక్కువ ఖర్చుతో తీర్చేందుకు ఇక్కడ సైతం వాటర్ వెండింగ్ మిషన్లను ఏర్పాటు చేశారు. రైల్ నీరంటూ.. లీటర్ సీసాను రైల్వే స్టేషన్లలో, రైళ్లలో రూ.15కు అమ్ముతున్నారు. సామాన్యులు అవి కొనలేరు. అలాంటి వారు ఒక్కసారి ఐదు లీటర్ల బాటిల్‌ను నింపేసుకుంటే గమ్యం చేరేవరకూ తాగునీటికి ఇబ్బంది ఉండదు. ఇందుకోసం ద.మ.రైల్వే పరిధిలో కొత్త మెషిన్లను ఏర్పాటు చేసి తాగునీటిని అందిస్తున్నారు.

## ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపు కోసం కార్యకర్తలంతా కలసి కట్టుగా పని చేయాలి

### ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్





**దస్తురాబాద్ ఏప్రిల్ 30(ప్రభాత సమాచారం )**
రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారి మెజారిటీతో గెలిపించడానికి గడప గడపకు వెళ్లి ప్రచారం నిర్వహించాలని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం దస్తురాబాద్ మండలంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశమే దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. పేదల పక్షాన నిలబడి పోరాటం చేసే ఆత్రం సుగుణ గెలుపు కోసం కార్యకర్తలంతా కలసి సమిష్టిగా పని చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే బడుగు బలహీన వర్గాల జీవితాల్లో మార్పు వస్తుందన్నారు.ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ పార్టీ నెరవేరుస్తుందన్నారు.త్యాగాల కుటుంబం నుండి వచ్చిన రాహుల్ గాంధీ లాంటి గొప్ప నాయకుడు ఈ దేశానికి ప్రధాని కావడం ఎంతో అవసరముందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేద్దాం



**హైదరాబాద్ ఏప్రిల్ 30(ప్రభాత సమాచారం )**
మే 1 వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు ఆదిలాబాద్ పట్టణంలోని యాదవ సంఘ భవనంలో నిర్వహించబోయే 'అలుపెరుగని పోరాటం' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్యక్రమ కన్వీనర్ వరగంటి అశోక్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి, ప్రజా వాగ్గేయకారుడు జయరాజు గారు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఈ పుస్తకం ప్రముఖ జర్నలిస్టు, నివ్స్ క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పురకాయస్థ రచించినది. ఎమర్జెన్సీ కాలం నుండి నేటివరకు తన జీవితంలో జరిగిన సంఘటనలు, తాను ఎదుర్కొన్న నిర్బంధాలను జర్నలిస్టులు, అభ్యుదయవాదులు, ప్రశ్నించే గొంతుకలపై జరుగుతున్న అకృత్యాలను ఈ పుస్తకంలో ఆయన వివరించారు. ఈ పుస్తకాన్ని ప్రతీ ఒక్కరూ చదవాలని ఈ కార్యక్రమానికి జిల్లాలోని కవులు, కళాకారులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, ప్రగతిశీల మేధావులు, ప్రజాస్వామ్యవాదులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు ఎ స్వామి, టి సూర్య కుమార్, ఎం సురేష్ , పూసం సచిన్, అన్నమొల్ల కిరణ్, చిన్నన్న తదితరులు పాల్గొన్నారు.

## పదవతరగతిలో 50 ఆశ్రమ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత

### ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి ఖుష్బూ గుప్తా.



**ఉట్నూర్ ఏప్రిల్ 30(ప్రభాత సమాచారం)**
పదవతరగతి పరీక్ష ఫలితాలలో ఉమ్మడి అదిలాబాద్జిల్లాలోని 50 ఆశ్రమ పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయని ఐటిడిఎ పిఓ ఖుష్బూ గుప్తా అన్నారు.ఇదే మాదిరిగా వచ్చే విద్యా సంవత్సరంలో ఉమ్మడి అదిలాబాద్ ఆశ్రమ పాఠశాలలు అన్నీ వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా, నాణ్యమైన విద్యను అందించేలా, ప్రతీ ఆశ్రమ పాఠశాలలో మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలుపుతూ విద్యార్థులను అభినందించారు.

## విదేశీ విద్యార్థుల కోసం అదనంగా 25% సీట్లు

### విద్యాసంస్థలకు యూజీసీ మార్గదర్శకాలు

న్యూఢిల్లీ : విదేశీ విద్యార్థుల కోసం అదనంగా 25% సీట్లను పెంచుకోవచ్చని ఉన్నత విద్యా సంస్థలకు యూజీసీ సూచించింది. ప్రస్తుతం అనుమతించిన సీట్లకు అదనంగా వీటిని పెంచుకోవచ్చని తెలిపింది. వీటిని సూపర్ న్యూమరరీ సీట్లుగా వ్యవహరిస్తారని, వీటిని కేవలం విదేశీ విద్యార్థులకు మాత్రమే రిజర్వు చేయాలని స్పష్టం చేసింది. యూజీ, పీజీ కోర్సులకు ఇది వర్తిస్తుందని తెలిపిం ది. స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం కింద ఎంపికయిన విద్యార్థులకు ఈ సూపర్‌న్యూమరరీ కోటా వర్తించదు. స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో సీట్లు మిగిలితే వాటిని కూడా విదేశీ విద్యార్థులకే ఇవ్వాల్సి ఉంటుంది. ఓపెన్, డిస్టెన్స్ లెర్నింగ్ (ఓడీఎల్) కోర్సుల్లో విదేశీ విద్యార్థులను చేర్చుకోవడానికి అనుమతి లేదని యూజీసీ తెలిపింది.

# శునకాలు.. వానరాల బెడద తీరేదెలా?

కరీంనగర్ : కోతిరాంపూర్‌లో రాత్రి నడుచుకుంటూ వెళుతున్న నలుగురిని పిచ్చికుక్క కరిచింది. వారం కిందట కిసాన్‌నగర్‌లో సైకిల్‌పై వెళ్తున్న ఓ యువకుడిని శునకం వెంబడించి గాయపర్చింది. రాంనగర్‌లో ఓ ఇంటి యజమాని ఇంట్లో ఉక్కపోత భరించలేక వరండాలో విశ్రాంతి తీసుకుంటుండగా.. కోతులు లోపలికి చొరబడి వస్తువులను చిందరవందర చేశాయి, ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లాయి. జిల్లాలో వానరాలు, శునకాల బెడద తీవ్రంగా ఉంది. రోడ్ల వెంట వెళ్లే వారిపై శునకాలు దాడి చేస్తుండగా.. కోతులు ఇళ్లలోకి చొరబడి మరీ ఆహార పదార్థాలు, తినుబండారాలు ఎత్తుకెళ్తున్నాయి. నగరవ్యాప్తంగా లెక్కలేనన్ని కోతులు ఉన్నాయి. ఇళ్లలోకి గుంపులుగా వచ్చి వస్తువులను చిందర వందర చేస్తూ నానాహంగామా సృష్టిస్తున్నాయి. మరో వైపు నగరంలో శునకాల సంతానం కూడా పెరిగింది. ఒక్కో వీధిలో పాతిక సంఖ్యలో శునకాలు ఉన్నాయి. దారి వెంట వెళ్లే చిన్నారులు, వృద్ధులపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. వీటి నియంత్రణపై మాత్రం నగరపాలిక ఆలోచన చేయడం లేదు.

ఎనిమిది నెలలుగా నిలిచిన శస్త్రచికిత్సలు



యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ), జంతు సంరక్షణ బోర్డు ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం వీధి కుక్కల సంఖ్య అదుపునకు శస్త్రచికిత్సలు చేయాలి. గతేడాది మార్చిలో టెండర్లు నిర్వహించి సంతానం తగ్గించేందుకు చర్యలు చేపట్టారు. నాలుగు నెలల్లో 821 కుక్కలకు శస్త్రచికిత్స చేయగా.. జంతు సంరక్షణ బోర్డుకు ఫిర్యాదు వెళ్లింది. అప్పటి నుంచి శస్త్రచికిత్సలు నిలిపి వేశారు. జంతు సంరక్షణ కేంద్రం ఏర్పాటుకు ఎకరం స్థలాన్ని రెవెన్యూ అధికారులు పట్టణ ప్రణాళికకు అప్పగించారు. అందులో షెడ్లు, ఇతర సౌకర్యాలకు భవన నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అధికారులు ఆ స్థలాన్ని పరిశీలించి నిధులు కేటాయించాల్సి ఉండగా నిర్లక్ష్యం చేస్తున్నారు. కుక్కలు, కోతులను పట్టుకోవాల్సి ఉండగా సంబంధిత అధికారులు నిబంధనలతో వెనక్కి తగ్గుతున్నారు. వీటి సంతానం తగ్గించేందుకు శస్త్రచికిత్సలు, ఆరోగ్యం కోసం వ్యాక్సినేషన్ చేస్తామని నగరపాలక అధికారి ఒకరుకు తెలిపారు. కుక్కలు, కోతులను నియంత్రించాల్సిన అవసరముంది.

పెరిగిన సంతానం


కరీంనగర్‌లో మర్కటాల పట్టివేతకు రెండు నెలలుగా బ్రేక్ పడింది. నగరంలోని చెట్లు, భవనాలే ఆవాసంగా అవి ఇళ్లలోకి చొరబడి తినే పదార్థాలతోపాటు ఇతర వస్తువులను ఎత్తుకెళ్తున్నాయి. నగరవ్యాప్తంగా అన్ని వీధుల్లో కోతుల బెడద ఉంది. వీటిని పట్టుకొని అటవీ ప్రాంతానికి తరలించాలనే ఫిర్యాదులు అధికారుల వద్దకు వెల్లువెత్తుతున్నాయి. నగరంలోని 60 డివిజన్లలో 5 వేల కుక్కలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. రాత్రి అయితే చాలు వీటి గోల అధికంగా ఉంటుంది. అరుపులతో కాలనీవాసులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. దారి వెంట వెళ్తున్న పిల్లలు, వృద్ధులు, మహిళలను గాయపరుస్తున్నాయి.

# గోసి చీర.. నేతన్నకు భరోసా

సిరిసిల్ల : పని చేయాలంటే ప్రత్యామ్నాయ మార్గం ఉంటుంది. ఉన్నచోటే ఉపాధికి భరోసా ఏర్పడుతుంది. ఆదాయం మార్గం కూడా ఉంటుందని నిరూపిస్తున్నారు సిరిసిల్లకు చెందిన పలువురు నేతన్నలు. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి బతుకమ్మ చీరలు, ఇతర ఆర్డర్లు లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే మరమగ్గాల శబ్దం ఆగిపోకూడదని భావించి ప్రత్యామ్నాయంగా పట్టణానికి చెందిన పలువురు నేతన్నలు కాటన్ గోసి చీరలు నేస్తూ ఉపాధి పొందుతూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

కార్మిక క్షేత్రమైన సిరిసిల్ల ఒకప్పుడు నేతన్నల ఆకలి చావులు, ఆత్మహత్యలతో ఉరిశాలగా మారింది. గత భారాస ప్రభుత్వం బతుకమ్మ చీరలు, రంజాన్, క్రిస్మస్ పండగలను పురస్కరించుకొని ఆర్డర్లు, ఆర్‌వీఎం ఆర్డర్లు అందించి నేతన్నలకు ఉపాధి కల్పించింది. దీంతో నేతన్నల ఆకలి కేకలు తగ్గుముఖం పట్టాయి. ఇప్పుడు నూతన ప్రభుత్వం కొలువుదీరడంతో ఆర్డర్లు ఇంకా ఇవ్వలేదు. దీంతో కొందరు ప్రభుత్వం అందించే ఆర్డర్లపై ఆధారపడకుండా కాటన్ గోసి చీరలు నేస్తూ ఉపాధి పొందుతున్నారు. ప్రత్యామ్నాయం వెతుక్కుని రోజుకు రూ.500 వరకు సంపాదిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు.

పట్టణానికి చెందిన పలువురు మరమగ్గాల కార్మికులు గత పది సంవత్సరాల నుంచి గోసి చీరలు నేస్తున్నారు. ప్రస్తుతం 100 మంది ఆసాములు, 500 మంది వరకు కార్మికులు వీటి ద్వారా ఉపాధి పొందుతున్నారు. గోసి చీర 9 గజాలు ఉంటుంది. పల్లుకు 78 పిక్కులు, మిగతా చీర 68 పిక్కులు ఉంటుంది. ఇతర చీరలు మాదిరిగా కాకుండా దీనిని నేస్తున్నప్పుడు చాలా జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలని



చెబుతున్నారు. దీనిని రూపొందించడానికి మరమగ్గాలకు పింజర్లు, జకార్డులు అమర్చాల్సి ఉంటుంది. పని భారం ఎక్కువగా ఉంటుంది. కార్మికుడికి ఒక చీర నేస్తే రూ.82 కూలీ అందుతుంది. అలా కార్మికులు రోజుకు రూ.500 వరకు ఆదాయం పొందుతున్నారు. సిరిసిల్లలో తయారు చేస్తున్న వీటిని ఆదిలాబాద్, నిజామాబాద్, ఖానాపూర్, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. కేవలం ప్రభుత్వం అందించే ఆర్డర్ల కోసమే వేచిచూడకుండా ప్రత్యామ్నాయ ఉపాధి వెతుక్కుని ధైర్యంగా ముందుకు సాగుతున్నారు.

మనోధైర్యం కోల్పోవద్దు – తడుక బాలరాజు, ఆసామి

సిరిసిల్ల మరమగ్గాల కార్మికులు మనోధైర్యం కోల్పోవద్దు. ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను వెతుక్కుని కుటుంబాన్ని పోషించాలి. చేయాలనుకుంటే పని దొరుకుతుంది. కుటుంబం గురించి ఆలోచించి ధైర్యంగా ముందుకు నడవాలి. గోసి చీరలతో కార్మికులు రోజుకు రూ.500 వరకు సంపాదిస్తున్నారు.

# వెంటాడుతున్న అకాల వర్ష భయం



ఎల్లారెడ్డిపేట : అన్నదాతలు వరి గింజలు పూర్తిగా ఎండకుండానే... కమతాలు తడారకుండానే వరి కోతలు చేపడుతున్నారు. అకాల వర్షాల భయంతో ఎంత ఖర్చుకైనా వెనుకాడకుండా ముమ్మరం చేశారు. వరి కోత యంత్రాలకు భారీగా వ్యయం చేస్తున్నారు. అదేవిధంగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలు, మిల్లులు, ఇళ్లకు తరలించేందుకు ట్రాక్టర్ల రవాణా ఛార్జీలు సైతం తడిసిమోపెడవుతున్నాయి. ఫలితంగా పంట పెట్టుబడి వ్యయం పెరుగుతుండటంతో ఆందోళనకు గురవుతున్నారు.

80 శాతం పూర్తి: జిల్లాలో యాసంగి సీజన్‌లో 1,74,750 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇప్పటి వరకు 75 నుంచి 80 శాతం వరి కోతలు అయ్యాయి. వచ్చే నెల 15 నుంచి 20 నాటికి మొత్తం పూర్తవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు భావిస్తున్నారు. ఎకరానికి సగటున 25 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఈ లెక్కన జిల్లాలో దాదాపు 4.36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని పౌరసరఫరాలశాఖ అధికారులు లెక్క కట్టారు. 259 కొనుగోలు కేంద్రాల ద్వారా 3.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

అన్నదాతకు వాత: వరి కోతలకు యంత్రాలపైనే రైతులు ఆధారపడుతున్నారు. టూవీలర్ హార్వెస్టర్ యంత్రానికి గంటకు రూ. 1,800 ఉండగా, ఇప్పుడు దానిని రూ. 2 వేలకు పెంచారు. అలాగే ఫోర్ వీలర్ యంత్రానికి గంటకు రూ. 2,400 నుంచి రూ. 2,500 వరకు, ట్రాక్ (చైన్) యంత్రానికి గంటకు రూ. 2,800 నుంచి రూ. 3 వేల వరకు యజమానులు వసూలు చేస్తున్నారు. పెద్ద కమతాల్లో ఎకరం వరి పొలం కోసేందుకు గంట నుంచి 1.20 గంటల సమయం పడుతుంది. అకాల వర్షం, వడగళ్ల వానల భయానికి కమతాలు తడారకముందే పైరును కోయిస్తున్నారు. ఇందుకు ఫోర్‌వీలర్, ట్రాక్ యంత్రాలనే ఎక్కువగా వినియోగిస్తున్నారు. తడి ఉన్న నేలల్లో యంత్రాలు వేగంగా ముందుకు కదలక వరి కోతకు సమయం ఎక్కువ పడుతుందని రైతులు చెబుతున్నారు. దీంతో అద్దె, ధాన్యాన్ని ట్రాక్టర్లతో తరలించేందుకు రవాణా ఛార్జీలు తడిసిమోపెడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశుగ్రాసం సేకరణలో భాగంగా ఎండుగడ్డిని కట్ట కట్టేందుకు బేలర్ యంత్రాలు, గడ్డి రవాణాకు ట్రాక్టర్ ఛార్జీలను యజమానులు పెంచుతున్నారని చెబుతున్నారు. అకాల వర్షాలు పొంచి ఉన్న నేపథ్యంలో వరి కోతలను త్వరగా ముగించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

పెట్టుబడులే అధికం

మాకున్న ఎనిమిది ఎకరాల్లో వరి సాగు చేశాం. ట్రాక్ హార్వెస్టర్ మిషన్‌తో వరిని కోయిస్తే 12 గంటలైంది. సాధారణంగా ఎకరా విస్తీర్ణంలో సాగు మొదలుకొని పంట కోత వరకు సుమారు రూ. 23 వేల నుంచి రూ. 25 వేల వరకు పెట్టుబడి వ్యయం అవుతుంది. పురుగు మందుల పిచికారీ ఖర్చులు, ధాన్యం తరలింపు, రైతుల శ్రమ అదనం. వచ్చే ఆదాయంలో సగానికి పైగా పెట్టుబడికే పోతుంది.

సురేందర్‌రెడ్డి, రైతు, రాచర్ల బొప్పాపూర్

ఏడు ఎకరాలకు 9.30 గంటలు పట్టింది నా సొంత భూమి 1.30 ఎకరాలుండగా, మరో 11 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి పంట వేశాను. ఆకాశం మేఘావృతమవడంతో 7 ఎకరాలను ట్రాక్ యంత్రంతో కోయిస్తే 9.30 గంటల సమయం పట్టింది. మరో నాలుగు ఎకరాలను టూవీలర్‌తో కోయిస్తే 4.25 గంటలు తీసుకుంది. ఇంకా 2.2 ఎకరాల్లో కోయించాల్సి ఉంది. వరి కోతలకే ఎక్కువ ఖర్చు అవుతుంది. ల్యాగల వినోద్, రైతు, రాచర్ల బొప్పాపూర్

# విస్తరించని జాతీయ మార్కెట్ వ్యవస్థ



జగిత్యాల : రైతుల పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలందిస్తూ దేశవ్యాప్తంగా విపణిపై పట్టుసాధించటం.. పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు నల్లబజారుకు తరలకుండా చూసి.. సరకుల నియంత్రణతో ధరల అదుపు ప్రధాన ఉద్దేశంగా కేంద్రప్రభుత్వం ఈ–నామ్(ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెటింగ్)ను 2016 ఖరీఫ్‌నకు ముందు ప్రవేశపెట్టింది. దేశంలోని 615 మార్కెట్లను ఈ–నామ్ పరిధిలో చేర్చగా యార్డుల్లో కంప్యూటర్లు తదితర ఆన్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. కానీ ఈనామ్ యార్డులను జాతీయ సర్వర్‌తో అనుసంధానించకపోవటం, కొనుగోళ్లు ఇతర మార్కెట్లకు విస్తరించనందున అన్నదాతలు కష్టించి పండించిన పంటలను స్థానిక యార్డుల వ్యాపారులే కొనుగోలు చేయడంతో ధరల్లో పెరుగుదల ఉండటంలేదు. గతంలో బీటులో వేలం ద్వారా ఉత్పత్తులను కొనుగోలు చేసే వ్యాపారులు ప్రస్తుతం కంప్యూటర్ల ద్వారా ధరలను కోట్‌చేసి కొంటున్నారు. పంట ఉత్పత్తుల ధరల్లో ఏమాత్రం పెరుగుదల నమోదులేక కర్షకులకు గిట్టుబాటు గగనంగా మారుతోంది.

ఈ–నామ్ మార్కెట్ల పరిధిలో గుర్తింపు పొందిన వ్యాపారులు దేశంలో ఎక్కడినుంచైనా సరకులు కొనవచ్చు. స్థానిక బీటునుంచి సరకులు వ్యాపారి ప్రాంతానికి తరలించనుండగా మార్కెట్ కార్యదర్శి ద్వారా రైతులకు ఆన్‌లైన్‌లో చెల్లింపులు జరుపుతారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్త వ్యాపారులు పోటీలో ఉంటే కనీసం 10 శాతం వరకు ధరలు పెరిగే అవకాశం ఉంది. కాబట్టి దేశవ్యాప్త వ్యాపారులు పోటీపడేలా అన్నియార్డులను అనుసంధానించాలి.

ఏకీకృత మార్కెట్‌ను విస్తరిస్తే దిల్లీ, నాగ్‌పూర్, సాంఘ్లీ, నిజామాబాద్, ఈరోడ్ తదితర ప్రాంతాల వ్యాపారులు ఆన్‌లైన్ ద్వారానే స్థానిక బీటు నుంచి పసుపు, మామిడి తదితర ఉత్పత్తులను కొనవచ్చు. రైతులు దూరప్రాంతం వెళ్లాల్సిన భారం తప్పుతుంది. అన్ని ఆన్‌లైన్ మార్కెట్లను జాతీయ సర్వర్‌తో అనుసంధానిస్తే జీరో క్రయవిక్రయాలు అరికట్టబడి ప్రభుత్వానికి ఆదాయం సమకూరటం.. సరకుల క్రయవిక్రయాలు ఆన్‌లైన్‌లో ఉంటాయి కాబట్టి అక్రమ నిల్వలు అరికట్టబడి ధరలు అదుపులో ఉంటాయి. జగిత్యాల, మెట్పల్లి, గొల్లపల్లి యార్డులు ఈనామ్ పరిధిలో ఉండగా జాతీయ సర్వర్‌తో అనుసంధానించాలి. పెద్ద యార్డుల్లోనే క్రయవిక్రయాలు సాగుతుండగా మండల కేంద్రాల యార్డులు నామమాత్రంగా మారాయి.

మార్కెట్లను ఆన్‌లైన్ చేయాలి, గ్రామాల్లో జీరో క్రయవిక్రయాలను పూర్తిగా అరికట్టాలి. మార్కెట్ల కార్యదర్శులు, అధికారులు, సిబ్బంది పోస్టులను భర్తీచేయాలి. అన్ని యార్డుల్లోనూ నిరంతరం లావాదేవీలను జరపాలి. గ్రామీణ మక్కలు, ధాన్యం సేకరణ కేంద్రాల్లో సిమెంట్‌గచ్చు నిర్మించాలి.

చల్‌గల్ మామిడి మార్కెట్‌లో నిర్మించిన పండ్లను మాగేసే కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలి. చల్‌గల్‌లో శాశ్వత పండ్ల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలి. గోదాముల నిర్మాణాన్ని పూర్తిచేయాలి.

రైతులు వరి, జొన్న, సజ్జ, ఆవాలు, మక్క తదితర పంటల్లో విత్తనోత్పత్తి చేపడుతున్నందున ఈ పంట క్రయవిక్రయాలన్నీ మార్కెట్ల పరిధిలోకి తేవాలి. జీరో సేకరణను నియంత్రించాలి.

# అన్నదాతల్లో చిగురిస్తున్న ఆశలు

ఖమ్మం : రూ.2 లక్షల చొప్పున రైతుల రుణాలను ఆగస్టు 15 నాటికి మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించటంతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించినా ఇప్పట్లో రైతు రుణమాఫీ కాదని చాలామంది భావించారు. కానీ సీఎం స్పష్టమైన హామీ ఇవ్వటంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రైతులు మాఫీ కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. రుణమాఫీ విధివిధానాలు ఖరారు కావాల్సి ఉంది.

పంట రుణ పరిమితి ప్రకారం..జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ), గ్రామీణ వికాస్ బ్యాంకు(ఏపీజీవీబీ), స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ), బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంకు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, యూకో బ్యాంకు, ఇండియన్ బ్యాంకు ఇలా మొత్తం 28 ప్రభుత్వ రంగ, ప్రైవేటు బ్యాంకులు పంట రుణాలు మంజూరుచేస్తున్నాయి. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ (పంట రుణ పరిమితి) ప్రకారం ఆయా బ్యాంకులు రైతులకు ఏటా వానాకాలం, యాసంగిలో పంట రుణాలు ఇస్తాయి. పంటలు పండిన తర్వాత బ్యాంకులు నిర్దేశించిన సమయానికి వడ్డీతో సహా రైతులు రుణాలు చెల్లించాలి. ఉభయ జిల్లాల్లో అధిక శాతం రైతులకు రుణాలను డీసీసీబీ, ఏపీజీవీబీ, ఎస్‌బీఐ మంజూరు చేస్తున్నాయి.

కటాఫ్ తేదీపై ఉత్కంఠపంట రుణాల మాఫీ విషయంలో కటాఫ్ తేదీ అనేది ముఖ్యం. ఏ తేదీని సర్కారు పరిగణనలోకి తీసుకుంటుందనే అంశంపై రైతుల్లో ఉత్కంఠ నెలకొంది. కొన్ని నెలలుగా డీసీసీబీ, సహకార సంఘాలు రైతుల నుంచి సుమారు 95 శాతం రుణాలు వసూలు చేశాయి. వసూళ్లలో ఖమ్మం డీసీసీబీ రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. ఏపీజీవీబీ సైతం బకాయిలు ఉన్న రైతులకు నోటీసులు జారీ చేసింది. చాలామంది రైతులు తమ రుణాలను ప్రభుత్వం మాఫీ చేస్తుందని చెప్పినా డీసీసీబీ, ఏపీజీవీబీ పట్టించుకోలేదు. ప్రస్తుతం ఇవన్నీ రెగ్యులర్‌గా ఇచ్చిన రుణాల జాబితాలో చేరాయి. డిసెంబరు 9ని కటాఫ్ తేదీగా తీసుకుంటే ఇప్పుడు రెన్యువల్ అయిన రుణాలకు మాఫీ వర్తించే అవకాశం ఉండబోదని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ సంవత్సరం మార్చిని కటాఫ్ తేదీగా పరిగణిస్తేనే రూ.2లక్షల రుణమాఫీ పథకం వర్తించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. కటాఫ్ తేదీ ప్రకటించాకే ఎంతమంది రైతులకు ఎంతమేర రుణం మాఫీ అవుతుందనే విషయంపై స్పష్టత రానుంది. గతంలో రూ.లక్ష రుణమాఫీకి సంబంధించి అప్పటి భారాస సర్కారు 2018 నవంబరు 11న ప్రకటన చేసింది. అదే తేదీని కటాఫ్‌గా తీసుకుంది. ఇప్పుడు సీఎం రేంవత్‌రెడ్డి ఏనిర్ణయం తీసుకుంటారోనని రైతులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# గెలుపు బాధ్యత మీదే!

పరిగి: సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ నేతలు ఎన్నికల ప్రచారానికి మరింత పదును పెడుతున్నారు. ఉదయం మొదలు రాత్రి వరకు తమ పర్యటనలను కొనసాగిస్తున్నారు. ఎప్పటికప్పుడు తాజా పరిస్థితులపై స్థానిక నాయకులను అడిగి తెలుసుకుంటున్నారు. ప్రధానంగా మండల స్థాయిలో ఉన్న నాయకత్వానికే గెలుపు బాధ్యతలను అప్పగిస్తున్నారు. మీ మండలంలో ఇంత మెజార్టీ తీసుకువచ్చే విధంగా పనిచేయాలని దిశా నిర్దేశం చేస్తున్నారు. మండల, తాలుకా స్థాయిలో కార్యకర్తల సమావేశాలను నిర్వహిస్తూ వారిని ఉత్తేజితులను చేస్తున్నారు. కాంగ్రెస్, భాజపా, భారాస నాయకులు ఎవరికి వారు తమ వ్యూహాలను రూపొందించుకుంటూ ముందుకు సాగుతున్నారు. బూత్‌స్థాయిలో ఐదారుగురు ఒక బృందంగా ఏర్పడి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తుండటంతో పరిగి నియోజకవర్గ రాజకీయం రసకందాయంలో పడింది.

రంజిత్‌రెడ్డి తరపున టీఆర్ఆర్: జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తమ అభ్యర్థి రంజిత్‌రెడ్డి విజయానికి విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఆయనతో పాటు ఆయన సతీమణి ఉమారెడ్డి, రంజిత్‌రెడ్డి అర్ధాంగి సీతారెడ్డి కూడా ఇంటింటి ప్రచారంతో ముందుకు సాగుతున్నారు.

గట్టి పోటీ ఇవ్వాలని భాజపా..

అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలైన భాజపా ఈసారి పరువు కోసం గట్టి పోటీ ఇచ్చేందుకు తలపడుతోంది. 2014లో తెరాస తరపున పోటీ చేసిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి 73,023 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. మారిన సమీకరణల నేపథ్యంలో ఈసారి ఆయన భాజపా నుంచి బరిలో ఉన్నారు. పార్టీ ఇంఛార్జిగా వ్యవహరిస్తున్న బూనేటి కిరణ్ కేంద్రం అమలు చేస్తున్న పథకాలతో ప్రచారం చేస్తున్నారు. గతంలో కొండాకు ఉన్న పరిచయాలు ఇక్కడ ప్రధానం కానున్నాయి.

పాగా వేయాలని భారాస

శాసనసభ ఎన్నికల్లో పరాజయం పాలైన భారాస తిరిగి నియోజకవర్గంలో పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తోంది. ఓటర్లు ఎక్కువగా ఉ



న్న గ్రామాలపై మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి దృష్టి పెట్టారు. పార్టీ నాయకులతో సమావేశాలను నిర్వహిస్తూ వారిని ఉత్తేజితులను చేస్తున్నారు. నియోజకవర్గంలో బీసీల ఓటు బ్యాంకు అధికంగా ఉన్న నేపథ్యంలో కాసాని దృష్టి పరిగిపై పడింది. స్థానికంగా ఉన్న పరిచయాలు, ఆయా పార్టీల నాయకులతో ఉన్న సంబంధాలను మరింత బలపరుచుకునేందుకు కృషి చేస్తున్నారు.

ముగ్గురూ పాతవారే

ఇటీవలి వరకు భారాస పార్లమెంటు సభ్యునిగా పనిచేసిన గడ్డం రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ తరపున పోటీలో ఉన్నారు. భారాస నుంచి గతంలో ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా పనిచేసిన కాసాని జ్ఞానేశ్వర్, గతంలో ఎంపీగా పనిచేసిన ప్రస్తుత భాజపా అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కూడా జిల్లాకు సుపరిచితులే. నామినేషన్లు కూడా దాఖలు చేయడంతో అసలు ఘట్టం ప్రారంభమైంది. ఎవరికి వారు అంచనాలు వేసుకుంటూ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో పల్లెల్లో ప్రచారం ఊపందుకుంది.

# నగరవాసి.. నీటికి అల్లాడి

పరిగి:వేసవికి భూగర్భ జలాలు అడుగంటడంతో పాటు, జలమండలి సరఫరా చేసే నీటి పరిమాణం సైతం తగ్గుతోంది. అవసరాలకు సరిపడా నీరు లభించక అల్లాడుతున్న జనాన్ని ప్రైవేటు ట్యాంకర్ల నిర్వాహకులు అందినకాడికి దోచుకుంటున్నారు. మరోవైపు 'తక్కువ ధరకే శుద్ధజలం' లక్ష్యం నీరుగారిపోయింది. ప్రధాన రైల్వే స్టేషన్లను పట్టించుకుంటున్న ద.మ.రైల్వే ఎంఎంటీఎస్ స్టేషన్లను పట్టించుకోవడం లేదు.ఎండిన బోర్లు.. నిండని సంపులు

నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి కొరత తీవ్రమవుతోంది. అరగంటుళం నల్లా కనెక్షన్ ఉన్న ఇంటికి నెలకు 15 కిలోలీటర్ల నీటిని అందిస్తున్నట్లు జలమండలి చెబుతోంది. కానీ 9–10 కి.లీ.కు మించి సరఫరా అయ్యే పరిస్థితి లేదు. అంటే 10 ఫ్లాట్లు ఉన్న అపార్టుమెంట్‌కు 15 వేల కి.లీ. వరకు అందించాలి. వేసవి కావడంతో ప్రస్తుతం 7–8 వేల కి.లీ. సరఫరా చేస్తున్నారు. నెల నుంచి భూగర్భ జలాలు అడుగంటడంతో పూర్తిగా జలమండలి పైనే ఆధారపడుతున్నారు. నీటి కొరత వల్ల అరగంటకు మించి సరఫరా చేయడం లేదు. నార్సింగి, మణికొండ, మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, కాప్రా



తదితర ప్రాంతాల్లో ట్యాంకర్లకు భారీగా డిమాండ్ ఉంటోంది. గతంలో అపార్టుమెంట్‌లో సంపులు నిండిపోయి నల్లా బంద్ చేసుకునే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు సంపులు సగమైనా నిండడం లేదని స్థానికులు వాపోతున్నారు.

ట్రాకింగ్ ఎక్కడ..?గ్రేటర్ వ్యాప్తంగా నీటి ట్యాంకర్లకు డిమాండ్ పెరగడంతో జలమండలి అదనపు ట్యాంకర్లు, ఫిల్లింగ్ కేంద్రాలు, ఫిల్లింగ్ పాయింట్లను ఏర్పాటు చేస్తోంది. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ల నుంచి అదనపు నీటిని తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. పలు ప్రాంతాల్లో ట్యాంకర్ బుక్ చేసిన 2–3 రోజులైనా సరఫరా కావడం లేదు. ఈ సమయాన్ని తగ్గిస్తామని అధికారులు చెబుతున్నా మార్పు కనిపించడం లేదు. బుకింగ్ నుంచి సరఫరా వరకు సరైన ట్రాకింగ్ ఉండటం లేదని వినియోగదారులు చెబుతున్నారు. కొందరు ప్రైవేటు ట్యాంకర్ల యజమానులు కాలనీల మధ్య బోర్లు తవ్వి నీటిని తోడి అమ్ముకుంటున్నారు. దీంతో చుట్టుపక్కల ఇళ్లల్లోని బోర్లు ఎండిపోతున్నాయి.




## ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం.. గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీల ప్రచారం

ఆదిలాబాద్ లోక్‌సభ స్థానాన్ని కైవసం చేసుకోవడానికి ప్రధాన పార్టీలు ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నాయి. సిటింగ్ స్థానాన్ని కాపాడుకునేందుకు భాజపా హిందుత్వ నినాదంతో ప్రజల్లోకి వెళ్తోంది. గ్యారంటీల అమలు, ప్రజాపాలనపై కాంగ్రెస్ విస్తృత ప్రచారం చేస్తోంది. కాంగ్రెస్, భాజపా వైఫల్యాలను భారాస ఎండగడుతోంది.




హైదరాబాద్: తెలంగాణ పదో తరగతి ఫలితాలను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం విడుదల చేశారు. ఫలితాల్లో 91.31 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పరీక్షలు నిర్వహించారు. మొత్తం 5,05,813 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫలితాల్లో బాలికలు పైచేయి సాధించారు. 93.23 శాతం బాలికలు, 89.42 శాతం బాలురు పాసయ్యారు. 99.05 శాతంతో నిర్మల్ జిల్లా మొదటి స్థానంలో..65.10 శాతంతో వికారాబాద్ చివరి స్థానంలో నిలిచాయి. రాష్ట్రంలో 3,927 పాఠశాలలు శతశాతం ఉత్తీర్ణత సాధించినట్లు బుర్రా వెంకటేశం తెలిపారు. 8,883 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించినట్లు చెప్పారు.

**జూన్ 3 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు :** జూన్ 3 నుంచి 14 వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు వెంకటేశం తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు నేటి నుంచి 15 రోజుల పాటు అవకాశం కల్పిస్తున్నామని.. మే 16లోపు ప్రధానోపాధ్యాయుల వద్ద ఫీజు చెల్లించవచ్చన్నారు. రీకౌంటింగ్‌కు రూ.500, రీవెరిఫికేషన్‌కు రూ.1000 చెల్లించాలని వివరించారు. ఫలితాల పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఒత్తిడికి గురికావొద్దన్నారు. ఈ పరీక్షల ఫలితాలు జీవితంలో ఒక భాగం మాత్రమేనని.. అవే జీవితం కాదన్నారు. పరీక్షల్లో ఫెయిలైనా జీవితంలో అద్భుతాలు చేసినవారు ఎందరో ఉన్నారని చెప్పారు.




## అభ్యంతరకర వీడియోల ఘటన.. ఎంపీ ప్రజ్వల్‌పై సస్పెన్షన్ వేటు

బెంగళూరు: హాసన సిటింగ్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలు కన్నడ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. అదే సమయంలో జేడీఎస్ కీలక నిర్ణయం తీసుకుంది. మంగళవారం ప్రజ్వల్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. ఈ మేరకు పార్టీ కోర్ కమిటీ నిర్ణయం తీసుకుంది. అలాగే ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఇదిలా ఉంటే..ఈ పరిణామానికి ముందు ప్రజ్వల్ బాబాయ్, మాజీ ముఖ్యమంత్రి హెచ్.డి. కుమారస్వామి మీడియాతో మాట్లాడారు. ఈ వివాదం వెనక కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ హస్తం ఉందని ఆరోపించారు. వెంటనే ఆయన్ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. “ఆ వీడియోల్లో ప్రజ్వల్ ముఖం కనిపిస్తోందా..? అవి అతడివేనన్న ఆధారం ఏంటి..? అయినా సరే నైతికత ఆధారంగా చర్యలు ఉంటాయి” అని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంపై సిట్ దర్యాప్తు చేస్తోందన్న మాజీ సీఎం.. వీడియో క్లిప్పులు ఉన్న పెన్‌డ్రైవ్‌లు ఎక్కడి నుంచి వచ్చాయి? ఎవరు పంపిణీ చేశారనే విషయాలపైనా దర్యాప్తు సాగాలన్నారు. “అసలు ఈ వీడియోల వెనక ఉన్నది ఎవరు? వారు స్త్రీల పరిరక్షకులా? అలాగే తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు” అని అన్నారు.

ప్రజ్వల్‌పై అభియోగాలు వాస్తవమని తేలితే చట్టప్రకారం శిక్ష తప్పదని గతంలో వెల్లడించారు. కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను ప్రస్తావించిన ఆయన.. భాజపాకు, ప్రధాని మోదీకి ఈ కేసుతో సంబంధం ఏంటని ప్రశ్నించారు. ఇక దేవేగౌడకు, తనకూ ఈ కేసుతో ఎటువంటి సంబంధం లేదన్నారు.

## కాంగ్రెస్ 14 సీట్లు గెలిస్తే రాజకీయ సన్యాసం : - మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు

హైదరాబాద్: మాదిగలకు టిక్కెట్ల కేటాయింపులో అన్యాయం చేసిన సీఎం రేవంత్ రెడ్డికి లోక్‌సభ ఎన్నికల్లో తమ సత్తా ఏమిటో చూపిస్తామని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. కాంగ్రెస్ పార్టీ 14 సీట్లు గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఆయన అన్నారు. రాష్ట్రంలోని 80 లక్షల మంది మాదిగలు రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై తిరుగుబాటు చేయబోతున్నారని ఆయన హెచ్చరించారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంఆర్‌పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగతో కలిసి మాట్లాడారు.

ఎంపీ సీట్ల కేటాయింపులో రెడ్డి, మాలలకే ప్రాధాన్యత ఇచ్చారని, మాదిగ జాతిని విస్మరించారని, ఈ కుట్రలో సీఎం రేవంత్‌రెడ్డిది ప్రధాన పాత్ర అని ఆరోపించారు. ఎంఆర్‌పీఎస్(%వీ=ూా%) అధినేత మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ మాదిగల అణచివేతకు నిరసనగా మే4న ఇందిరాపార్కు లేదా అంబేడ్కర్ విగ్రహం వద్ద మాదిగల సామూహిక దీక్ష, ధర్నా నిర్వహిస్తామని, మే 5 నుంచి రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మాదిగ ఆత్మగౌరవ పరిరక్షణ యాత్రలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్‌నరేష్ మాదిగ, జాతీయ నాయకులు ఎడవెల్లి యాదయ్యమాదిగ, ఎంఎస్ఎఫ్ ఇన్‌చార్జి నర్సింహులు మాదిగ పాల్గొన్నారు.

## ధాన్యం రోడ్డుపై పోసి రైతుల ఆందోళన.. భారీగా ట్రాఫిక్ జాం

యాదాద్రి భువనగిరి : కాంగ్రెస్ పాలనలో అన్నదాతలు అరిగోస పడుతున్నారు. ఆరుగాలం కష్టపడి, అప్పులు చేసి పంటలు పండిస్తే ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతన్నలు ఆగ్రహం చెందారు. కండ్ల ముందే పంటలు పాడవుతున్నా పట్టించుకోకపోవడంతో విసుగు చెందిన రైతులు రోడ్డుపైనే ధాన్యం పోసి తమ నిరసన తెలిపారు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో వలిగొండ మండలం రైతులు జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ట్రాక్టర్లలో ధాన్యం తీసుకొచ్చి, రోడ్డుపై పోసి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారం రోజులైనా ధాన్యం కొంటలేరని రాస్తారోకో చేపట్టారు. రైతుల ఆందోళనతో భారీగా ట్రాఫిక్ జామ్



అయింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రైతులను బుజ్జగించే ప్రయత్నం చేశారు. కొనుగోళ్లు చేపట్టే వరకు ఆందోళన విరమించమని రైతులు స్పష్టం చేశారు.




## ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ ఎన్‌కౌంటర్.. ఏడుగురు మావోయిస్టులు హతం

నారాయణ్‌పూర్ జిల్లాల సరిహద్దుల్లో మంగళవారం మావోయిస్టులు, భద్రతా సిబ్బంది మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్ లో ఏడుగురు నక్సల్స్ హతమయ్యారు. 15 రోజుల వ్యవధిలో ఈ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరగడం ఇది రెండోసారి. మహారాష్ట్ర సరిహద్దుకు సమీపంలోని తెక్‌మేట అటవీ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు నక్కినట్లు పోలీసులకు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో స్పెషల్ టాస్క్ ఫోర్స్, డీఆర్‌జీ దళాలు సంయుక్తంగా యాంటీ నక్సల్ ఆపరేషన్ చేపట్టాయి. సోమవారం రాత్రి నుంచే గాలింపు చేపట్టి.. మంగళవారం ఉదయం నక్సల్స్ ఉన్న ప్రాంతానికి చేరుకున్నాయి. వీరిని చూసిన మావోయిస్టులు కాల్పులు జరిపారు. దీంతో ఎదురు కాల్పులు జరిపిన భద్రతా దళాలు ఏడుగుర్ని మట్టుబెట్టాయి. వీరిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. మరికొందరు నక్సల్స్ పరారయ్యారు. ఈ కాల్పుల్లో భద్రతా సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదని బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ వెల్లడించారు.

ఘటనాస్థలం నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఆపరేషన్ కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు. ఇటీవల కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలిన విషయం తెలిసిందే. ఇక్కడ కాల్పుల్లో 29 మంది మరణించారు. వీరిలో ఉత్తర బస్తర్ డివిజన్ కమిటీకి చెందిన అగ్ర నాయకులు ఉన్నారు. తాజా ఘటనతో కలిపి ఈ ఏడాది ఇప్పటివరకు బస్తర్ అడవుల్లో మొత్తం 88 మంది నక్సల్స్‌ను భద్రతా సిబ్బంది హతమార్చారు.

## బీజేపీతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యం : ఈటల

హైదరాబాద్: బీజేపీతోనే అన్ని రంగాలలో అభివృద్ధి సాధ్యమని మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం మల్కాజిగిరికి చెందిన టీడీపీ నాయకులు, అడ్వకేట్ సుధీర్, ఫోరమ్ ఫర్ బెటర్ మల్కాజిగిరి ఉపాధ్యక్షుడు రాకేష్ తదితరులు ఈటల సమక్షంలో పార్టీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మోహన్‌యాదవ్, భాను, కృష్ణ, శ్రీలతరెడ్డి, దీప్తి, సంధ్య, వేణు, మహేషయాదవ్, రాజశేఖర్, మహేందర్ పాల్గొన్నారు.



**బీజేపీని గెలిపించాలి :** మౌలాలి డివిజన్‌లోని అక్షిత అపార్ట్‌మెంట్‌లో కార్పొరేటర్ గున్నాల సునీతాయాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఈటల రాజేందర్ సతీమణి ఈటల జమున విచ్చేసి రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి బీజేపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాసుదేవరావు, డివిజన్ అధ్యక్షుడు అనిపెద్ది సాయిబాబు, లింగరావు, మురళీకృష్ణ, జగదీష్ యాదవ్, కిరణ్, శివ తదితరులు పాల్గొన్నారు. ఘట్‌కేసర్ రూరల్... కేంద్రంలోని బీజేపీ సర్కార్ అన్ని వర్గాల సంక్షేమానికి చర్యలు తీసుకుంటుందని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ తెలిపారు. మండలంలోని కచవానిసింగారం, సుప్రభాత్‌టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్ఎస్?కు చెందిన మాజీ సర్పంచ్ కొంతం వెంకట్‌రెడ్డి తన అనుచరులతో కలిసి ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ... మోదీ గ్యారంటీతో దేశంలో బీజేపీకి 400 సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు చలువాది ప్రవీణ్‌రావు, ప్రధానకార్యదర్శి ప్రభంజన్‌గౌడ్, కౌన్సలర్ గొంగ్గళ్ళ మహేష్, నాయకులు అచ్చిని నర్సింహ, బసవ రాజుగౌడ్, శివరాజ్‌గౌడ్, సురేష్, శంకర్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్.. స్థాయిని మరిచి అబద్దాలు మాట్లాడుతున్నారన్న భట్టి



ఖమ్మం : పదేళ్లు పాలన చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నోటికొచ్చిన అబద్దాలు మాట్లాడుతున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కూసుమంచిలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో భట్టి మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూం ఇళ్ళు, ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి ఒక్క హామీని కూడా అమలు చేయని ఆయన ఈరోజు మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలో రాగానే ఇచ్చిన హామీల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రెండు వందల ఉచిత విద్యుత్, ఆరోగ్య శ్రీ, రూ.500 కే గ్యాస్ పథకాలు అమలు చేశామని తెలిపారు. రైతులపైన కాంగ్రెస్ పార్టీకి నిబద్ధత ఉందన్నారు. తాము వచ్చిన మూడు నెలల్లోనే రైతులకు ఇన్సూరెన్స్ కట్టించామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థుల మెస్ బిల్లులు కట్టకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం కట్టిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తారీకునే జీతాలు ఇస్తున్నామన్నారు. సిగ్గులేకుండా కరెంటు పోతుందని మాజీ ముఖ్యమంత్రి తన స్థాయిని మర్చిపోయి అబద్దాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గత ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను బండకేసి బాది ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నారన్నారు. రామచంద్రస్వామి సన్నిధిలో పేదలకు ఇళ్ళు ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి ఐదు వేలు ఇళ్ళు ఇస్తామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇంటికి ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షలు ఇస్తామన్నారు. ఈ దేశ సంపదను వారికి అనుకూలంగా ఉన్న వారికి దోచిపెడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ చేతులు కలిపి దేశాన్ని దోపిడీ చేయాలని చూస్తున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని భట్టి విక్రమార్క కోరారు.

## రాహిల్‌ను అరెస్ట్ చేయొద్దు.. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్, ఏప్రిల్ 30: జూబ్లీహిల్స్ రోడ్డు ప్రమాదం కేసులో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రాహిల్‌కు హైకోర్టులో ఊరట లభించింది. రాహిల్‌ను రెండు వారాల వాటు అరెస్టు చేయకుండా ధర్మాసనం స్టే విధించింది. గతంలో రాహిల్‌కు హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను సవాల్ చేస్తూ జూబ్లీహిల్స్ పోలీసులు అపీల్‌కు వెళ్లారు. ఈరోజు (మంగళవారం) పోలీసుల పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. రాహిల్ తరపు న్యాయవాది కోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. ఇరువురి వాదనలు విన్న హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. రెండు వారాల పాటు రాహిల్‌ను అరెస్టు చేయొద్దంటూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కాగా.. రెండేళ్ల క్రితం జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ చిన్నారి మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.

ప్రమాదం అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. కారుపై స్టిక్కర్ ఆధారంగా మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు చెందినదిగా గుర్తించిన పోలీసులు.. ప్రమాద సమయంలో కారులో షకీల్ కొడుకు రాహిల్, స్నేహితులు ఆఫ్నాన్, మాజ్ ఉన్నట్లు నిర్ధారించారు. అయితే అనూహ్యంగా కారు తానే నడిపాను అంటూ ఆఫ్నాన్ అనే యువకుడు పోలీసులకు లొంగిపోయాడు. అయితే గతంలో రాహిల్‌ను తప్పించేందుకు కొందరు పోలీసులు ఉన్నతాధికారులు ప్రయత్నం చేసినట్లు కూడా సమాచారం. మరోసారి ఈ కేసును రిఓపెన్ చేసిన పోలీసులు.. బాధితుల నుంచి మళ్లీ వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఈ కేసులో ఏ1గా ఉన్న రాహిల్‌ను ఏప్రిల్ 8న పోలీసులు అరెస్ట్ చేశారు. దీనిపై నిందితుడు హైకోర్టును ఆశ్రయించగా.. రాహిల్‌ను ఈనెల 18 వరకు అరెస్ట్ చేయవద్దంటూ హైకోర్టు ఆదేశించింది. ఈ కేసులో బెయిల్ రావడంతో రాహిల్ చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యారు. అయితే రాహిల్‌కు బెయిల్ ఇవ్వడంపై పోలీసులు హైకోర్టులో అపీల్‌కు వెళ్లగా.. మరో రెండు వారాల పాటు రాహిల్‌ను అరెస్ట్ చేయవద్దంటూ న్యాయస్థానం మరోసారి ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రభాత
సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660